క్లుప్తంగా

స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తుంగతుర్తి : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల (ఎస్సీ కాలనీ)లో విద్యార్థులు బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధుల, అధికారులు పాత్రలను పోషించి అలరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు సూర్యప్రకాశ్, సత్తయ్య, రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఐ మన్మోహన్‌కు సన్మానం



మన్మోహన్‌ను సన్మానిస్తున్న స్నేహితులు, పూర్వ విద్యార్థులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన ఎల్లెంల మన్మోహన్‌యాదవ్ ఎల్బీనగర్ సీసీఎస్ సీఐగా పనిచేస్తూ ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా డ్యూటీ మీట్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. దీంతో బుధవారం అతడిని పూర్వ విద్యార్థులు, స్నేహితులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీ ఎల్లెంల కొమిరెల్లి, పులిచర్ల మధు, బొల్లం లింగరాజు, మాదగాని వెంకటేశ్వర్లు, ఆకుల రాజేందర్, లింగయ్య, సైదులు మల్లిఖార్జున్ ఉన్నారు.

కొనసాగుతున్న ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డు ఆన్‌లైన్ నమోదు



ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న గండూరి కృపాకర్ తదితరులు

సూర్యాపేట : పట్టణంలోని విద్యానగర్ 45వ వార్డులో ప్రజల సంక్షేమం కోసం వార్డు కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆరోగ్య శ్రీ హెల్త్ కార్డు ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా నిర్వాహకుడు గండూరి కృపాకర్ మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా వ్యక్తిగత ఆరోగ్య బీమా ప్రతి సంవత్సరం రూ.5లక్షల వరకు వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, పార్టీ నాయకులు రంగినేని లక్ష్మణరావు, బజ్జూరి శ్రీనివాస్, బెజగం ఫణి, కుక్కడపు సాలయ్య, భిక్షం పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ దుర్గామల్లేశ్వరి, శివాలయ ఆలయం ముందు భాగంలో శ్రీఅభయాంజనేయ స్వామి 27అడుగుల భారీ విగ్రహ ఏర్పాటుకు సర్పంచ్ బిట్టు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం నాభిశిలా వేయించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు భూమి పూజలో పాల్గొని ముత్యం, పగడం, నవధాన్యాలు వేసి పూజలు నిర్వహించారు.

మాజీ ఎంపీపీ జన్మదినం



తిరుమలగిరి : జన్మదిన కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొమ్మినేని సతీష్ జన్మదిన వేడుకలను బుధవారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కందుకూరి లక్ష్మయ్య, నాని, శంకర్, సందీప్, వెంకన్న, రమేష్, సతీష్‌రెడ్డి, సురేష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి మదర్ థెరిస్సా మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో తిరుమలగిరి మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్ జన్మదిన సందర్భంగా బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జలగం రామచందర్‌గౌడ్, శ్రీనివాస్, సురేష్‌కుమార్, వెంకటేశ్వర్లు, కృష్ణమచారి, గణేష్ పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ లేక ఇక్కట్లు

- నిలువ నీడలేక బస్సుల కోసం ఎండలోనే నిరీక్షణ
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, విద్యార్థులు



అర్వపల్లి వైజంక్షన్‌లో ఎండలోనే రోడ్డుపై బస్సుల కోసం వేచిచూస్తున్న విద్యార్థులు

అర్వపల్లి : నిలువ నీడ లేని బస్టాపులు ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నాయి. ఎప్పుడొస్తుందో తెలియని బస్సు కోసం గంటల తరబడి చెమటలు పోస్తూ ఎదురుచూడక తప్పడం లేదు. ప్రయాణికులు ఎక్కడికక్కడ మండుటెండల్లోనే బస్సుల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. ఒకవైపు ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రయాణికులు రోడ్లపై నిలబడే పరిస్థితి లేకుండాపోతుంది. అయినా ప్రయాణికులు సైతం నిప్పుల కొలిమిలో నించొని బస్సుల కోసం ఎదురు చూడక తప్పడం లేదు. హైవేల విస్తరణలో భాగంగా అర్వపల్లి మండల కేంద్రం మీదుగా రెండు జాతీయ రహదారులు వెళ్లాయి. దీంతో రెండు జాతీయ రహదారులు కలిసే మెయిన్ రోడ్డులో వైజంక్షన్‌ను నిర్మించారు. జంక్షన్ చుట్టూ లైటింగ్స్ ఇతర ఏర్పాట్లు చేశారు. ఈ నాలుగు కూడళ్లు కలిసే ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లు సైతం నిర్మించారు. అయితే రెండు జాతీయ రహదారుల కూడలి కావడంతో ఇక్కడికి ప్రతిరోజు వివిధ గ్రామాల ప్రజలు వ్యాపారాల నిమిత్తం వేల సంఖ్యలో వచ్చి వెళ్తుంటారు. కాని ఈజంక్షన్ ప్రాంతంలో బస్‌షెల్టర్ లేక వచ్చిపోయే ప్రయాణికులకు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు నిత్యం ఇబ్బందులు తప్పడంలేదు.

రోడ్డుపైనే ప్రయాణికుల పడిగాపులు..

వైజంక్షన్‌లో రోడ్డే బస్‌షెల్టర్‌గా మారింది. ఈ జంక్షన్‌పైనే బస్సులు, ఇతర వాహనాలు నిలుపుతున్నారు. వచ్చిపోయే ప్రయాణికులు కూడా రోడ్డుపైనే నిల్చునీడ లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. హైవే అధికారులు వైజంక్షన్‌లో బస్‌షెల్టర్ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా వివిధ కారణాలతో షెల్టర్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రతిరోజు ఇక్కడికి వచ్చే ప్రజలు, పాఠశాలలకు వచ్చే, కళాశాలలకు వెళ్లే 1000మంది వరకు విద్యార్థులు ఇబ్బందులు పాలవుతున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి మండల కేంద్రంలో బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు.

బస్‌షెల్టర్ వెంటనే ఏర్పాటు చేయాలి



అర్వపల్లిలో కోట్ల రూపాయలు వెచ్చించి రోడ్ల విస్తరణ, వైజంక్షన్‌ను ఏర్పాటు చేసినప్పటికీ బస్‌షెల్టర్ ఏర్పాటు చేయడాన్ని మరిచారు. దీంతో రోడ్డుపైనే ప్రయాణికులు, విద్యార్థులు వేచిఉండాల్సి వస్తుంది.

– పాక వీరేష్‌యాదవ్, సామాజిక కార్యకర్త

స్థల సమస్యతో నిర్మించలేకపోయాం

వైజంక్షన్‌లో బస్‌షెల్టర్ నిర్మాణం కోసం ఎంతో ప్రయత్నం చేశాం. అయితే స్థల సమస్యతో నిర్మించలేకపోయాం. ఇప్పటికైనా స్థానికులు స్థలాన్ని చూపిస్తే షెల్టర్ నిర్మాణానికి ప్రయత్నిస్తాం.

– ప్రవీణ్‌రెడ్డి, హైవే డీఈఈ



వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు చరమగీతం పాడాలి

- టీపీసీసీ కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి



వృద్ధురాలితో మాట్లాడుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

ఆత్మకూర్–ఎస్ : సీఎం కేసీఆర్ మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు చరమగీతం పాడాలని టీపీసీసీ కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఇస్తాలపురం, ముక్కుడుదేవులపల్లి, రామన్నగూడెం గ్రామాల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు పోరాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ కుటుంబం, జగదీశ్‌రెడ్డి కుటుంబం మాత్రమే బాగుపడ్డాయి గాని ప్రజల బతుకులు మారలేదని ఆయన విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నీటి మీద రాతలు అయ్యాయని, రైతు రుణమాఫీ లేదని, డబుల్ బెడ్‌రూంలు ఎక్కడా ఇవ్వలేదని, దళితులకు మూడెకరాలు ఒట్టిదైందన్నారు. 24గంటల కరెంట్ ఇస్తామని ఇప్పుడు 10గంటలు కూడా ఇవ్వడం లేదని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదని, పంటను కొనే నాధుడే లేడన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి ఇరుగు మధు, వెంకన్న, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు కలిగి ఉండాలి



స్కిల్ టెస్టులో పాల్గొన్న గీత కార్మికులు

పెన్‌పహాడ్ : గీత కార్మికులందరికీ సభ్యత్వం గుర్తింపుకార్డులు తప్పనిసరిగా ఉండాలని, గీత కార్మికులు చాలా జాగ్రత్తతో తాడిచెట్లు ఎక్కాలని ఎక్సైజ్ ఎస్ఐ కుమారస్వామి అన్నారు. బుధవారం మండల పరిధిలోని దూపహాడ్‌లో గీత పారిశ్రామిక సహకార సంఘంలో కొత్తగా తాటిచెట్లు ఎక్కుతున్న 30మంది గీత కార్మికులకు కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో తాటిచెట్టు ఎక్కే స్కిల్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుర్తింపు కార్డు ద్వారానే ప్రభుత్వం గీత కార్మికులకు సంక్షేమ పథకాలు వరిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మడ్డి అంజిబాబుగౌడ్, ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ నజీర్, గఫూర్, వనజ, కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు పాడిశెట్టి సైదులు, వెంకన్న, లచ్చయ్య, సైదులు, వీరయ్య, అంజయ్య, శ్రీను పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు



తిరుమలగిరిలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు

తిరుమలగిరి (తుంగతుర్తి) : బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని, ఈ అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ సీహెచ్.హన్మంతుతో పాటు పలువురు నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ల్యాండ్, స్యాండ్ మాఫియా సాగుతుందని ఆరోపించారు. 2024లో పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి ప్రదీప్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, మహేశ్వరరావు, వై.దీన్‌దయాళ్, పేరాల పూలమ్మ, ఎం.యాదగిరి, సోమయ్య, సాయిబాబా, వెంకట్‌రెడ్డి, బంగారి పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబంలోనే ఉద్యోగాలు

ఆత్మకూర్ (ఎస్) : తొమ్మిదేళ్ల టీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ కుటుంబానికి ఉద్యోగాలు వచ్చాయి తప్ప నిరుద్యోగులకు మాత్రం మొండిచేయి చూపారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని గట్టికల్‌లో ప్రజాగోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పందిరి రామ్‌రెడ్డి, నాయకులు సంధ్యాల సైదులు, కాపా రవి, మన్మథరెడ్డి, హబీబ్, పందిరి మాధవరెడ్డి, వీరేందర్, లింగయ్య, నాగార్జున పాల్గొన్నారు.

ప్రజాస్వామిక విప్లవానికి పోరాడుతాం



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కొత్తపల్లి శివకుమార్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజా సమస్యలే ఎజెండాగా జనతా ప్రజాస్వామిక విప్లవం కోసం పోరాడుతామని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కన్వీనర్ కొత్తపల్లి శివకుమార్ అన్నారు. బుధవారం పార్టీ ప్రథమ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని విక్రమ్ భవన్ ఎదుట ఎర్రజెండా ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ ఏర్పడి సంవత్సరం అవుతుందని, ఆ రోజు నుంచి ఈరోజు వరకు అనునిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలే ఎజెండాగా, వాటి పరిష్కారం అయ్యేంత వరకు నిత్యం పోరాడుతున్న పార్టీ అన్నారు. ప్రజల్లో ఉంటూ ప్రజలను చైతన్యం చేసి సమస్యపై పోరాటం చేసి విప్లవం సాధించడమే పార్టీ లక్ష్యమన్నారు. జిల్లాలో నిత్యం ప్రజలకు అండగా ఉంటూ పేదలకు ఇళ్ల స్థలాలు కావాలంటూ పోరాటం చేసిన పార్టీగా ముందు వరుసలో ఉందని, జిల్లాలో అంతర్గత రోడ్లు, వివిధ ప్రజా సమస్యలపైన అనునిత్యం పోరాడుతూ ప్రజాపునాదిని కలిగి ప్రజల కోసమే పనిచేస్తున్న విప్లవ పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, అధ్యక్షుడు చంద్రకళ, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రామోజీ, ప్రజాపంథా పట్టణ కార్యదర్శి గులాం, రేణుక, జయమ్మ, కవిత, గౌరమ్మ పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆవిర్భావం

తుంగతుర్తి : మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకుడు ఎర్ర అఖిల్‌కుమార్ పార్టీ జెండాను ఆవిష్కరించి, అనంతరం దుబ్బాక సంజీవరెడ్డి విజ్ఞాన కేంద్ర ప్రజాపంథా డివిజన్ కార్యాలయాన్ని ప్రాంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాలతో సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. నాడు సమ సమాజ నిర్మాణం కోసం ఉద్యమాలు చేపట్టింది భారత కమ్యూనిస్టు పార్టీలేనని అన్నారు. కార్యక్రమంలో గొడ్డలి నర్సయ్య, కాసర్ల దుర్గయ్య, ఈర్ల వెంకన్న, కర్ణాకర్, పరుశరాములు, అనిల్, పుష్ప, సుధాకర్, నాగరాజు, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మద్దిరాల : గొర్రెలకు నట్టల నివారణ మందు పంపిణీలో పాల్గొన్న ఎస్‌ఏ.రజాక్, తదితరులు

మద్దిరాల : సీజనల్ వ్యాధుల పట్ల గొర్రెలకాపరులు అప్రమత్తంగా ఉండాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముకుందాపురంలో రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలకు, మేకలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న నట్టల నివారణ మందుల ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ అక్కిరెడ్డి జ్యోతి ఉపేందర్‌రెడ్డి, కన్న వీరన్నగౌడ్, మండల పశువైద్యాధికారి అసిఫా తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : గొర్రెల, మేకల పెంపకందారులు ప్రభుత్వం అందిస్తున్న నట్టల నివారణ మందును సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమమల్లారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి రవికుమార్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

నాగారం : రైతులు గొర్రెలు, మేకలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందును తాపించాలని ఎంపీపీ కూరం మణివెంకన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ సంచాలకులు బి.వెంకన్న, మండల పశువైద్యాధికారి డాక్టర్ బత్తుల రవి, జేవీఓ వై.నాగరాజు, ఎల్ఎస్ఏ మురళీ, సిబ్బంది మధుసూదన్, రైతులు బారి అనిల్, రమేష్, లింగరాజు, కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం

అర్వపల్లి : మండలంలోని తిమ్మాపురంలో గల అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్ర తృతీయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామునే ఉషాపద్మినీఛాయ సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం క్షేత్రంలో సుప్రభాతసేవ, విశేష అభిషేకాలు నిర్వహించారు. అలాగే సౌరహోమం జరిపారు. భక్తులు హాజరై సూర్యభగవానుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, గణపురం నరేష్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సుఖ ప్రసవాలు

అర్వపల్లి : ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సుఖ ప్రసవాలు జరుగుతాయని మండల సామాజిక ఆరోగ్య అధికారి ఎల్.చరణ్ అన్నారు. బుధవారం మండలంలోని కొమ్మాల ఎస్సీకాలనీలో గర్భిణులకు ఆరోగ్య పరీక్ష నిర్వహించి అనంతరం వారికి అవగాహన కల్పించారు. అర్వపల్లి పీహెచ్‌సీలో ప్రసూతికి అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ఇక్కడ ప్రసూతి అయితే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. ఈ సందర్భంగా గర్భిణులను 102 వాహనంలో ఆసుపత్రికి పంపించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు రమణ, ఊర్మిళ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి



సూర్యాపేట రూరల్ : కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ



పెన్‌పహాడ్ : కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ నెమ్మాది భిక్షం



నాగారం : కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కూరం మణి



తుంగతుర్తి : గానుగుబండలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రామచంద్రారెడ్డి

సూర్యాపేటరూరల్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు కుప్పిరెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో నివసించే వారు కంటి పరీక్షలు చేయించుకునే స్తోమత లేదని గ్రహించి వారున్న ప్రాంతంలో కంటి వెలుగు శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు వెంపటి సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, వార్డు ఇన్‌చార్జ్ జనార్దనచారి, భార్గవ్‌కుమార్, రఫీ, సూపర్‌వైజర్ జానకమ్మ, కంటివెలుగు మెడికల్ ఆఫీసర్ అనూష, తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గానుగుబండలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ నాగునాయక్, హెచ్ఈఓ సముద్రాల సూరి, నాయకులు రాములుగౌడ్, దుర్గాయ్య, చంద్రయ్య, వైద్యసిబ్బంది సోమన్న, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

మద్దిరాల : కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్, జెడ్పీటీసీ కన్న సురాంభవీరన్నగౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముకుందాపురంలో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అశ్రీత, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, సర్పంచ్ అక్కిరెడ్డి జ్యోతిఉపేందర్‌రెడ్డి, డాక్టర్ పర్శ్యానాయక్, సిబ్బంది చిన్న రవీంద్రనాథ్‌ఠాగూర్, ఎల్లయ్య, కోమరయ్య, జగదీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : ప్రజలకు మెరుగైన కంటి వైద్యం అందించడం కోసమే తెలంగాణ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం చేపట్టిందని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. బుధవారం మండల పరిధిలోని లక్ష్మీతండాలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ లునావత్ సూర్యానాయక్, ఎంపీటీసీ లునావత్ శాంతబాయి, ఉప సర్పంచ్ లునావత్ మాత్యనాయక్, డాక్టర్ స్రవంతి, కుసుమ, పంచాయతీ కార్యదర్శి అయేషు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు వైద్య సేవలు అందించడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ నెమ్మాది భిక్షం అన్నారు. బుధవారం మండల పరిధిలోని భక్తాళాపురంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓంకారం, కార్యదర్శి మునీర్, నీలాల సతీష్, రవీందర్, రాజేందర్, రాంబాబు, నాగయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి

నాగారం : రాష్ట్రంలో సంపూర్ణ అంధత్వ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ కూరం మణివెంకన్న అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పసుపులేటి ప్రేమలతవెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ మహేష్, డాక్టర్ హర్షవర్ధన్, అప్తమాలజిస్ట్ కె.ఉమ, కార్యదర్శి జంపాల శ్రీనివాస్, వైద్యసిబ్బంది, ఆశలు పాల్గొన్నారు.

వేసవిలో నీటిఎద్దడి రాకుండా చూసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భిక్షం

పెన్‌పహాడ్ : వేసవిలో గ్రామాల్లో మంచినీటి సమస్య రాకుండా చూడాలని ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య అన్నారు. బుధవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. నీటి ఎద్దడి ఏర్పడకుండా మిషన్ భగీరథ అధికారులు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమన్వయం చేసుకొని ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమీక్ష సమావేశానికి కేవలం ఇద్దరు సర్పంచ్‌లు, ఇద్దరు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. దీంతో పంచాయతీ కార్యదర్శుల తోనే సమీక్షా కొనసాగింది. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈలు పాపరావు, వెంకటేశ్వర్లు, డీఈ పాండు, ఏఈలు శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

అర్వపల్లి : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామంలో బుధవారం ఉపాధిహామీ పథకం నిధులతో చేపట్టే సీసీరోడ్ల పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రమావత్ పీరమ్మ, ఉపసర్పంచ్ వాక సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్‌రావ్, నాయకులు రమావత్ భీముడు, పూల సైదులు, వనం శేఖర్, ఏ.శేఖర్, సైదులు, నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వీధి కుక్కలకు ఆపరేషన్లు

సూర్యాపేట : పట్టణంలో సంచరిస్తున్న వీధి కుక్కల నిర్మూలనలో భాగంగా హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి 268కుక్కలను ఫ్యామిలీ ప్లానింగ్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి బుధవారం తెలిపారు.

వార్షికోత్సవ కరపత్రాల పంపిణీ

అర్వపల్లి : మండల కేంద్రంలోని శ్రీయోగా షిర్డీసాయి మందిరం తృతీయ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో కరపత్రాలు పంచుతూ మైక్ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కడియం రామచంద్రయ్య, ఆలయ చైర్మన్ వి.శ్రీనివాసరావ్, కడియం సోమక్క మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ కడియం కల్యాణ్‌చందర్, ఆలయ అర్చకుడు సాయిరాం పాల్గొన్నారు.

ముగిసిన మహా శివరాత్రి ఉత్సవాలు

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని పిల్లలమర్రి శివాలయంలో మంగళవారం రాత్రి త్రిశూల స్నానం, ఏకాంత సేవ కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో మహా శివరాత్రి ఉత్సవాలు ముగిసినట్లు దేవాలయ కమిటీ చైర్మన్ జెరిపోతుల భిక్షం బుధవారం తెలిపారు.

తోట పవన్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి

నాగారం : వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్మకంటి సోమయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రకు వస్తున్న ప్రజాధరణ చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ నాయకులు వలీ, నరేష్, సాయికుమార్, సంపత్, ఉన్నారు.

అర్వపల్లి : వరంగల్ పశ్చిమ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌పై బీఆర్ఎస్ నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్ అన్నారు. తోట పవన్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం జాజిరెడ్డిగూడెంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సంగ్రామ మహా పాదయాత్రలు చేపట్టాలి

భానుపురి (సూర్యాపేట) : ఎస్సీ రిజర్వేషన్ల సాధన కోసం జిల్లాలో మాదిగల సంగ్రామ మహా పాదయాత్రలు చేపట్టాలని మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో నిర్వహించిన మహాజన సోషలిస్టు పార్టీ, ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజయ్య, నాయకులు నాగార్జున, ఏడుకొండలు పాల్గొన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలి

సూర్యాపేట రూరల్ : 8వ విడత హరితహారానికి నర్సరీల్లో మొక్కలు పెంచి సిద్ధం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు అధికారులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని యండ్లపల్లి, సపావట్‌తండా గ్రామాల్లో నర్సరీలను పరిశీలించి మాట్లాడారు. అనంతరం యండ్లపల్లిలో మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న మరుగుదొడ్ల పనులు, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శి గీత ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన ఎర్ర రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడితో పాటు పదోతరగతి చదువుకున్న స్నేహితులు బుధవారం దశదినకర్మకు హాజరై మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.42,000 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎర్ర యాదగిరి, నాతి మహేష్, తీగుళ్ల యాదగిరి, కల్లెట్లపల్లి లాలు, అంబటి శ్రీనివాస్, నాతి అశోక్, జంపాల వెంకన్న, రవి, వెంకన్న, సుమన్, ఆంజనేయులు ఉన్నారు.

రైతుబంధు నగదు జమ చేయాలి

మద్దిరాల : ఇప్పటి వరకు రైతు బంధు నగదు అందని రైతులకు వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని కాంగ్రెస్ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో దాదాపు 104మంది రైతులకు పైగా నగదు జమకాలేదని వెంటనే వారి ఖాతాల్లో జమచేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బర్పటి ఉపేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి సురేష్, కుతిబుద్దిన్, పాక అమృతమల్లు, లింగయ్య పాల్గొన్నారు.

ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించుకోవాలి

అర్వపల్లి : ఆటోమెటిక్ స్టార్టర్లను రైతులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని మండల డిస్కం ఏఏఈ వి.శ్రీకాంత్ కోరారు. విద్యుత్‌శాఖ సీఎండీ ప్రభాకర్‌రావ్ ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని తిమ్మాపురం, జాజిరెడ్డిగూడెం గ్రామాల్లో వ్యవసాయ మోటార్ల ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. స్టార్టర్లను వెంటనే తొలగించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు ఎం.జోయల్, ఎల్.వెంకటేశ్వర్లు, లైన్‌మెన్‌లు రాజేష్, పూర్ణయ్య పాల్గొన్నారు.

కరపత్రం విడుదల

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ హాస్టల్‌లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల కరపత్రాన్ని జన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తగుళ్ల జనార్దన్‌యాదవ్ బుధవారం విడుదల చేశారు.